



రెచ్చిపోతున్న
సైబర్ నేరగాళ్లు

- డ్రగ్స్ పార్సల్, బ్యాంక్ రుణం, క్రెడిట్ కార్డు, ఉద్యోగాల పేరిట మెస్సేజ్‌లతో మోసాలు
- కమిషనరేట్‌లో 220 కేసులు, 15 మంది అరెస్టు
- 197 కేసుల్లో రూ. 1.09 కోట్లు రికవరీ
- మూల్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్

-కరీంనగర్ క్రైం, ఆంధ్రజ్యోతి

6

నేటి నుంచి ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు

- కలెక్టర్ పమేలా సత్పతి

- ఆంధ్రజ్యోతిప్రతినిధి, కరీంనగర్

8

- రెండు పంట కాలాల్లో అందని పెట్టుబడి సాయం
- ఏడాదిగా రైతులకు ఎదురుచూపులే...
- మంత్రి తాజా ప్రకటనతో ఆశలు



సంక్రాంతికైనా 'భరోసా' దక్కేనా?

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రైతులకు రైతుభరోసా పేరిట పెట్టుబడి సాయంగా ఎకరాకు 7,500 రూపాయలు అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఆ హామీ అమలుకు నోచుకోలేదు. తాజాగా వ్యవసాయశాఖ మంత్రి చేసిన ప్రకటనతో రైతుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. వచ్చే మంత్రివర్గ సమావేశంలో రైతుభరోసాపై చర్చించి సం క్రాంతి నుంచి ఈ పథకాన్ని అమలులోకి తీసుకువస్తామని ఆయన వెల్లడించడంతో ఈ యాసంగిలో పెట్టుబడి సాయం అందుతుందని రైతులు ఆశిస్తున్నారు.

ప్రతి యేటా రూ. 360 కోట్ల వరకు పెట్టుబడి సాయం

జిల్లావ్యాప్తంగా లక్షా 90వేల పైచిలుకు రైతులకు సుమారు మూడు లక్షల డెబ్బై వేల ఎకరాల భూమి ఉన్నది. ప్రతి యేటా రెండు సీజన్లలో 350 కోట్ల నుంచి 360 కోట్ల రూపాయల పెట్టుబడి సాయం జిల్లా రైతులకు అందేది. 2024 వానాకాలం, యాసంగి సీజన్లలో ఈ సాయం పొందలేక పోయారు. 2018లో ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ఎకరాకు ఐదు వేల రూపాయల పెట్టుబడి సాయాన్ని అందించడానికి రైతుబంధు పథకాన్ని ప్రారంభించారు. 2018 నుంచి 2023 వరకు 12 పంటకాలాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకం కింద పెట్టుబడి సాయం అందిస్తూ వచ్చింది. ప్రతి సీజన్‌లో 170 కోట్ల నుంచి 180 కోట్ల రూపాయల పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమైంది.

జిల్లాలో 3.5 లక్షల ఎకరాల సాగుభూమి

కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పెట్టుబడి సాయాన్ని ఎకరాకు 7,500లకు పెంచి అందించాలని నిర్ణయించింది. బీఆర్ఎస్ హయాంలో సాగులో లేని భూములకు, రియల్ ఎస్టేట్ భూములకు, వందల ఎకరాలు ఉన్న భూస్వాములకు రైతుబంధు సాయం అందించడంతో ప్రభుత్వ నిధులు బడాబాబుల జేబుల్లోకి వెళ్లాయనే విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని నియమించి రైతుల అభిప్రాయాలు తెలుసుకుని, విధివిధాలను ఖరారు చేయాలని కోరింది. పార్లమెంట్ ఎన్నికలు, ఇతరత్రా కారణాల నేపథ్యంలో కేబినెట్ సబ్ కమిటీ అన్ని జిల్లాల్లో పర్యటించి నివేదిక ఇవ్వలేక పోయింది. సంక్రాంతి నుంచి రైతుభరోసా పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో డిసెంబరు నెలలో సబ్ కమిటీ నివేదిక రూపొందించి కేబినెట్‌కు సమర్పిస్తుందని తెలిసింది. వచ్చే కేబినెట్ సమావేశంలో ఈ పథకం అమలుకు ఆమోదముద్ర వేస్తారని ఆశిస్తున్నారు. అదే జరిగితే 2024-25 యాసంగి సీజన్‌కు రైతులకు ఎకరాకు 7,500 చొప్పున రైతు భరోసా సాయం అందనున్నది. ప్రస్తుతం జిల్లాలో 3.5 లక్షల ఎకరాల సాగు భూమి ఉన్నది. పెద్ద, చిన్న రైతుల అని తేడా లేకుండా అందరు రైతులకు రైతుభరోసా సాయం అందిస్తే జిల్లా రైతులకు 262.5 కోట్ల రూపాయల సాయం అందనున్నది.

బోనస్‌పై రైతుల్లో చర్చ

రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం సన్న వరి రకాలను పండించిన రైతులకు క్వింటాల్‌కు 500 రూపాయల

మిగతా 8వ పేజీలో...



మాట్లాడుతున్న పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి
నూతన కానిస్టేబుళ్లు

విధుల్లో చేరిన 349 మంది కానిస్టేబుళ్లు

- ప్రతిభ ఆధారంగా స్టేషన్లు కేటాయించిన సీపీ

కరీంనగర్ క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల శిక్షణ పూర్తి చేసుకుని జిల్లాకు వచ్చిన 349 మంది కానిస్టేబుళ్లు శనివారం విధుల్లో చేరారు. వీరందరూ శనివారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో రిపోర్టు చేశారు. వారికి వివిధ స్టేషన్లలో పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి పోస్టింగ్‌లు ఇస్తూ ఉత్త ర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనరేట్ కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కొత్తగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు సీపీ పలు సూచనలు చేశారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలన్నింటిని విధినిర్వహణలో ఆచరించాలన్నారు. సీనియర్ల సలహాలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ ఉద్యోగం సాధించేందుకు ఎంత కష్టపడ్డారో.. యూనిఫాం ధరించాక అంతే బాధ్యతగా వ్యవహరించాలన్నారు. క్రమశిక్షణపాటించాలని, నిజాయితీగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలన్నారు. శనివారం సాయంత్రంలోగా కేటాయించిన పోలీస్ స్టేషన్లలో విధుల్లో చేరాలని సీపీ ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, ఏవో మునిరామయ్య, ఏసీపీలు శ్రీనివాస్, విజయ్‌కుమార్, ఆర్‌ఐలు రజనీకాంత్, జానిమియా, కుమారస్వామి, శ్రీధర్‌రెడ్డి, మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు పండుగ ప్రత్యక్ష ప్రసారం



తిమ్మాపూర్ రైతు వేదికలో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

తిమ్మాపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్న రైతు పండుగ కార్యక్రమాన్ని తిమ్మాపూర్ రైతు వేదికలో ప్రత్యేక్ష ప్రసారం చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతు వేదికను బంతి పూలు, కొబ్బరి, మామిడి తోరణలు, రంగవల్లులతో అలంకరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా ఉద్యాన అధికారి శ్రీనివాసరావు, సహాయ వ్యవసాయ సంచాలకుడే ఎస్ శ్రీధర్, మండల వ్యవసాయధికారి సురేందర్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

భగత్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కొత పల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహిస్తున్న బాలల జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనను ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు తరగతి గదిలో ఏ విద్యార్థినీ నిరూత్సాహ పరుచవద్దన్నారు. ప్రతి విద్యార్థి తన భావాన్ని నిర్భయంగా వ్యక్తపరిచే విధంగా ప్రోత్సహించాలన్నారు. చిన్న అవిష్కరణలే పెద్ద విషయాలకు పరిష్కారాన్ని చూపిస్తాయన్నారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి మాట్లాడుతూ ప్రపంచం అజ్ఞానంలో మగ్గినప్పుడు భారతదేశం ప్రపంచానికి వెలుగులు నింపిందన్నారు. కొత్త అవిష్కరణలకు మూలం భారతదేశమే అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఈవో సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు, కొత్తపల్లి మున్సిపల్ ఛైర్మన్ రుద్ర రాజు, సెయింట్ జార్జ్ పాఠశాల ఛైర్మన్ ఫాతిమారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి చాడ జయపాల్‌రెడ్డి, డీసీఈబీ సెక్రెటరీ మారం స్వదేశీకుమార్, ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట్ల రామకృష్ణ, కౌన్సిలర్ వేణుగోపాల్, మహ్మద్ అజీం, భగవంతయ్య, ఏనుగు ప్రభాకర్‌రావు, కర్ర అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

పత్తి మద్దతు ధరలో కోత

- నాణ్యత పేరుతో ధర తగ్గించిన సీసీఐ
- క్వింటాలుకు 50 రూపాయల తగ్గింపు

చొప్పదండి, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): సీసీఐ పత్తి ధరలో కోత విధించింది. మద్దతు ధరకు 50 రూపాయలు తగ్గించి కొనుగోళ్లను చేపడుతోంది. రెండు రోజులుగా తగ్గించిన ధరతోనే సీసీఐ పత్తి కొంటోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎనిమిది శాతం తేమ ఉన్న పత్తికి 7,521 రూపాయల మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించంది. నెల రోజుల నుంచి సీసీఐ పత్తి కొనుగోలు చేస్తోంది. పత్తిలో నాణ్యంగా ఉండడం లేదని మద్దతు ధర క్వింటాలుకు 50 రూపాయలు తగ్గించి 7,471 రూపాయిలకే కొనుగోలు చేస్తుంది. ఎనిమిది శాతం తేమ ఉన్న పత్తి క్వింటాలుకు 7,521 రూపాయిలు చెల్లించాల్సి ఉండగా 50 రూపాయలు తగ్గించి తొమ్మిది శాతం తేమ ఉన్న పత్తి ధరను సీసీఐ అధికారులు నిర్ణయించారు. అకస్మాత్తుగా ధరను తగ్గించారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి దిగుబడి తగ్గిపోయిన సందర్భంలో పంట గిట్టుబాటు కావడం లేదని, ఉన్న ధరలో సీసీఐ కోత విధించడం తగదని రైతులు అంటున్నారు. మండలంలోని రుక్మాపూర్ కాటన్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి రైతుల నుంచి నేరుగా పత్తిని సేకరిస్తుంది. సహజంగా పత్తి నాణ్యత సంక్రాంతి తర్వాత పంట చివరి దశలో తగ్గుతుంది. సీసీఐ మాత్రం పత్తి నాణ్యత లేదని చెబుతూ మద్దతు ధరను తగ్గించడం తగదని రైతులు అంటున్నారు. చొప్పదండితోపాటు పొరుగు మండలాల నుంచి రైతులు ఇక్కడికి పత్తిని తీసుకువస్తున్నారు. పాత పద్ధతిలోనే పత్తికి 7,521 రూపాయల మద్దతు ధర ను చెల్లించాలని రైతులు కోరుతున్నారు.



రుక్మాపూర్‌జిన్నింగ్ మిల్లులో పత్తి నిల్వలు

జిల్లా ఆసుపత్రిలో వైద్యుల కొరత

- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందే దిక్కు
- వైద్య సేవలు అందక ఇబ్బందుల్లో రోగులు



సుభాష్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆసు పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసి ఏడాది దాటినా ఇప్పటికీ పూర్తిస్థాయిలో పోస్టులు భర్తీ చేయలేదు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బం దితోనే నెట్టుకొస్తున్నారు. అన్ని వసతులు, కావలసిన పరికరాలు అందుబాటులో ఉన్నప్పటికీ వైద్యసేవలు మాత్రం అందడం లేదు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడంతో ఈ ఆసుపత్రిని దానికి అనుగుణంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిగా మార్చి అందులో కావలసిన సదుపాయాలను ఏర్పాటు చేశారు. 500 పడకల ఆసుపత్రిని 700 వరకు పెంచారు. ఆసుపత్రి మొత్తం సెంట్రల్ ఆక్సిజన్ ఏర్పాటు చేశారు.

38 పోస్టులు ఖాళీ...

ప్రస్తుతం మెడికల్ కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు మొత్తం 115 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో 77 పోస్టులను రెగ్యులర్, కాంట్రాక్టు పద్ధతిపై భర్తీ చేశారు. అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు 30గాను 16 భర్తీచేయగా 14 ఖాళీగా ఉన్నాయి. ప్రొఫెసర్ పోస్టులు 27కుగాను 10 భర్తీ చేయగా 17 ఖాళీగా ఉన్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 58 గాను 51 భర్తీ చేయగా ఏడు ఖాళీగా ఉన్నాయి. మొత్తం 38 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. డిస్ట్రిక్ట్ రెసిడెన్స్ ప్రోగ్రాం కింది రెసిడెంట్ డాక్టర్లు (పీజీ పూర్తి చేసిన వారు)లను 10 మందిని మాత్రమే కేటాయించారు. ఆసుపత్రిలో రోగుల తాకిడి ఎక్కువగా ఉంటు న్న దృష్ట్యా మరో 10 నుంచి 15 మందిని కేటాయించాల్సి ఉంది.

ఇద్దరే రేడియాలజిస్టులు

మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెల 550 నుంచి 650కు పైగా ప్రసవాలు జరుగుతున్నాయి. గైనకాలజీతో పాటు రేడియా లజీ వైద్యుల సే వలు అందిస్తున్నారు. ఆసుపత్రి మొ త్తా నికి ఇద్ద రు రేడియాలజిస్టులు మాత్రమే సేవలందిస్తున్నారు. జిల్లా ఆసుపత్రితో పాటు, మాతా శిశు ఆరోగ్యకేంద్రంతో కలిపి ప్రతి రోజు 250కిపైగా స్కానింగ్‌లు చేస్తుంటారు. ఆన్‌కాల్ డ్యూటీలు కూడా వారే చేయాల్సి వస్తుంది. నర్సింగ్ సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. దీంతో డాక్టర్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. గైనకాలజీ పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. 500 పడకల ఆసుపత్రిగా మార్చినప్పటికి అందుకు సరిపడా వైద్యులు సిబ్బంది లేరు. ఇపుడు 700 పడకల ఆసుపత్రిగా మారినప్పటికి వైద్యులు సిబ్బంది కొరత తీరడం లేదు. శానిటేషన్, పేషంట్ కేర్ సిబ్బంది కొరత ఉంది. ఆసుపత్రిని మార్చడం, పడకల సంఖ్య పెంచినప్పటికి అందుకు సరిపడా శానిటేషన్, పేషంట్ కేర్ సిబ్బందిని పెంచడం లేదు. దీంతో పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వైద్యులు, సిబ్బంది కొరత తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



సిబ్బంది కొరతపై ప్రభుత్వానికి లేఖ రాశాం..

- డాక్టర్ వీరారెడ్డి, జిల్లా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్

జిల్లా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత ఉన్నది నిజమే. ఈవిషయమై ఇప్పటికే ప్రభుత్వానికి లేఖరాశాం. కలెక్టర్ ద్వారా కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

పనులు చేసే వారేరి?

- బల్దియాలో రూ.22 కోట్లతో 185 పనులకు టెండర్లు
- పెండింగ్ బిల్లులతో నిలిచిన అభివృద్ధి పనులు
- బకాయిలు ఇచ్చే వరకు పనులు చేసేది లేదంటున్న కాంట్రాక్టర్లు
- పాలకవర్గ గడువు దగ్గర పడడంతో కార్పొరేటర్లలో ఆందోళన



కరీంనగర్ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పాలకవర్గ పదవీ కాలం జనవరి 29తో ముగియనున్నది. సరిగ్గా రెండు నెలల్లో పదవీకాలం ముగియనుండడంతో డివిజన్లలో ఇంకా చేయాల్సిన పనులు మిగిలిపోవడంతో కార్పొరేటర్లు ఆందోళన చెందుతున్నారు. పాలకవర్గ పదవీకాలం ముగిసే సమయంలో ప్రతిసారి నగరపాలక సంస్థ సాధారణనిధులతో కోట్ల రూపాయలతో టెండర్లు నిర్వహించి, వాటిలో కొన్నిటిని ప్రారంభించడం, మరికొన్నింటిని ఎన్నికలు పూర్తయిన వెంటనే చేస్తామని హామీ ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి కూడా అదే తంతుగా అధికారులు 22 కోట్లతో 185 పనులకు టెండర్లు పిలిచారు. డిసెంబరు 3తో టెండర్ గడువు ముగియనున్నది. ప్రస్తుతం నగరపాలక సంస్థ ఉద్యోగ జీతభత్యాలు, కరెంటు బిల్లులు, పెట్రోల్, డీజిల్ వంటి నిర్వహణ ఖర్చులను కూడా చెల్లించలేని స్థితిలో ఉంది.

సమగ్ర సర్వేతో నిలిచిన పన్నుల వసూళ్లు

నవంబరు 4 నుంచి ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే విధుల్లో బల్దియా ఉద్యోగులంతా పాల్గొంటుండడంతో ఈనెల ఆస్తి పన్నులు, నల్లాబిల్లులు, ఇతరత్రా పన్నుల వసూళ్లు 90 శాతం నిలిచిపోయాయి. దీంతో జనరల్ ఫండ్ దాదాపు ఖాళీ అయ్యింది. మరోవైపు పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు సుమారు 30 కోట్ల మేరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. పట్టణ ప్రగతి, సీఎం హామీ ఇతర నిధులకు సంబంధించిన మరో 15 నుంచి 20 కోట్ల బకాయిలు ఉన్నాయి. దీంతో కాంట్రాక్టర్లు పెండింగ్ బిల్లుల కోసం కార్యాలయం చుట్టూ, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మధ్యలోనే నిలిపివేసి చేసిన పనులకు సంబంధించిన బిల్లులు చెల్లిస్తే తప్ప పూర్తిచేయమంటూ చేతులెత్తేశారు. చాలా చోట్ల రోడ్లు, డ్రైనేజీల కోసం తవ్వి వదిలిపెట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ ప్రగతి నిధులతో దాదాపు 50 చోట్ల రోడ్డు పనులు అసంపూర్తిగా వదిలిపెట్టారు.

బల్దియా ఖజానా ఖాళీ



ప్రతి సంవత్సరం పట్టణ ప్రగతి నిధుల్లో 10శాతం హరితహారానికి కేటాయించి మొక్కలను నాటి, వాటి సంరక్షించేవారు. ఈయేడు హరితహారానికి నిధులు లేక ఒక్క మొక్క కూడా నగరంలో నాటలేదు. పాలకవర్గానికి చివరి ఏడాది కీలకంగా మారుతున్న నేపథ్యంలో బల్దియా ఖజానా ఖాళీగా ఉండడం, రాష్ట్రంలో ప్రభుత్వం మారడం పాలకవర్గంపై తీవ్ర ప్రభావం పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బల్దియాలో సాధారణ నిధులు లేక పోయినా పాలకవర్గం ఒత్తిడి మేరకు డివిజన్‌కు 20 లక్షల నుంచి 30 లక్షల వరకు, శివారు డివిజన్లకు కోటి రూపాయల విలువ చేసే పనులతో 185 పనులను 22 కోట్లతో చేపట్టేందుకు టెండర్లు నిర్వహించారు. పాత బిల్లులు ఇస్తే తప్ప కొత్త పనులను చేయలేమంటూ కాంట్రాక్టర్లు చేతులెత్తేస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన టెండర్లలో కాంట్రాక్టర్లు పాల్గొనకుండా బహిష్కరించడంతో అధికారులు వారిని బుజ్జగించారు. ఒక్కొక్కరికి లక్షా 50వేల వరకు పెండింగ్ బిల్లు ఇస్తామని హామీ ఇచ్చి పనులు చేయించారు. ఆ తర్వాత బతుకమ్మ, దసరా పండుగ పనులను చేసేందుకు కూడా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అధికారులు వారిని ఒప్పించి పనులు పూర్తి చేయించారు. గతంలో నిర్వహించిన టెండర్లలో ఎస్టిమేట్ రేట్లతో కోట్ చేస్తూ వేసిన సింగిల్ టెండర్లను అంగీకరించలేదు. బతుకమ్మ, దసరా పనుల్లో టెండర్‌లో కోట్ చేసిన మేరకు బిల్ రికార్డు చేయకుండా పనులను బట్టి తక్కువతో బిల్లులు రికార్డు చేసినట్లు తెలిసింది. దీనితో కాంట్రాక్టర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. బల్దియాలో నిధులు లేవు.. అటు కాంట్రాక్టర్లు పనులు చేయాలనే ఉత్సాహంతో లేరు.. ఈ పరిస్థితిలో టెండర్లు నిర్వహిస్తే ప్రయోజనమేమిటని కార్పొరేటర్లు ప్రశ్నిస్తున్నారు.

బ్యాంకు అధికారుల వేధింపులు

- ఇంటి నుంచి వెళ్లిపోయిన బాధితుడు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి): ఇంటి నిర్మాణం కోసం ఓ ప్రైవేటు బ్యాంకులో తీసుకున్న రుణాన్ని చెల్లించాలని బ్యాంకు అధికారులు వేధింపులు తట్టుకోలేక ఇంటి యజమాని మజీద్ ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన ఎల్లారెడ్డిపేటలో శనివారం జరిగింది. తన భర్త కనిపించడం లేదని భార్య సల్మా కన్నీళ్లు పెట్టుకుంది. ఆమె తెలిపిన మేరకు.. గ్రామంలోని మజీద్ ఇంటి నిర్మాణం కోసం ఐదేళ్ల కిందట సిరిసిల్ల పట్టణంలోని ఓ ప్రైవేటు బ్యాంకులో ఐదు లక్షల రుణం తీసుకున్నాడు. వాయిదా పద్ధతిలో చెల్లించేందుకు అంగీకరించాడు. ప్రతి నెల పద్ధతిలో డబ్బులు చెల్లిస్తున్నాడు. ఇటీవల మజీద్ అనారోగ్యానికి గురవడంతో నెల వారి డబ్బులు చెల్లించేందుకు ఆలస్యమైంది. దాంతో బ్యాంకు అధికారులు గడువు ముగిసిందని పేర్కొంటూ నిత్యం మజీద్ ఇంటికి చేరుకుని చెల్లించాలని ఒత్తిడి చేశారు. వారి వేధింపులు భరించలేని తన భర్త మజీద్ తమకు చెప్పపెట్టకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదని బాధితురాలు సల్మా పేర్కొంది. ఘటనపై స్థానిక ఎస్ఐ రమాకాంత్‌ను వివరణ కోరగా తమకెవరూ ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

మానకొండూర్, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని లలితాపూర్ బస్టాండ్ వద్ద శనివారం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. కరీంనగర్ నుంచి జమ్మికుంట వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు, లారీ లలితాపూర్ బస్టాండ్ మూల మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఎవరికీ ప్రమాదం జరుగలేదు.



ఓదెలలో సాగు చేస్తున్న డ్రాగన్ పండ్ల తోట



విక్రయానికి సిద్ధంగా ఉన్న డ్రాగన్ ఫ్రూట్స్

పండ్ల తోటల సాగుపై ఆసక్తి

- డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్న సింగరేణి రిటైర్డ్ కార్మికుడు
- వరికంటే లాభదాయకం కావడంతో మరికొందరి దృష్టి

ఓదెల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఓదెల గ్రామానికి చెందిన చింతం లక్ష్మయ్య సింగరేణి కార్మికునిగా పనిచేసి ఉద్యోగ నాలుగేళ్ల క్రితం విరమణ పొందాడు. ఓదెల శివారులో తనకున్న ఎకరం భూమిలో డ్రాగన్ ఫ్రూట్ తోటను సాగు చేశాడు. రసాయనిక పద్ధతుల్లో కాకుండా సేంద్రియ పద్ధతిలో పండ్ల తోటను సాగు చేశాడు. మొదట రూ.5 లక్షల పెట్టుబడితో ప్రణాళికలు రూపొందించిన లక్ష్మయ్య సిద్దిపేట నుంచి ఒక్కోటి రూ.50 చొప్పున డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు తెప్పించి సాగు చేశాడు. పెట్టిన ఏడాది నుంచే దిగుబడి ప్రారంభమైందని, ఎకరానికి రూ.40 వేల వరకు లాభం వస్తుందని లక్ష్మయ్య పేర్కొన్నాడు. ఏటా జూన్ నుంచి డిసెంబరు వరకు పండ్లను కోసం సమీపంలోని వారసంతలకు తీసుకెళ్లి విక్రయిస్తుంటానని లక్ష్మయ్య తెలిపాడు. ఓదెలతో పాటు మరికొన్ని గ్రామాల్లో రైతులు డ్రాగన్ పండ్ల తోటను పెంచేందుకు సిద్ధమవుతున్నారు. వరి పంటకంటే అధిక లాభం వస్తుండడంతో పలువురు రైతులు పండ్ల తోటలవైపు దృష్టిని సారిస్తున్నారు.

● ఇష్టంతో కష్టపడుతున్నా..

- చింతం లక్ష్మయ్య, రైతు, ఓదెల



సింగరేణి కార్మికునిగా పనిచేసే విరమణ పొందిన తర్వాత కాలక్షేపం చేయలేదు. ముందు నుంచే వ్యవసాయం అంటే చాలా ఇష్టం. అందుకే ఇష్టంతో డ్రాగన్ పండ్ల తోటను పెంచేందుకు సిద్ధపడ్డాను. దీంతో అధిక లాభాలను పొందుతున్న పత్తి, వరి పంటలు సాగు చేసే బదులు పండ్ల తోటలను సాగు చేస్తే ఆర్థికంగా నష్టాలకు గురికారనే ఉద్దేశంతో డ్రాగన్ పండ్ల మొక్కలను తెప్పించి సాగుచేశాను. ఇతర పంటలకంటే రెండింతలుగా లాభాలు ఉంటున్నాయి. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా డ్రాగన్ మొక్కలను మిగతా రైతులకు అందజేస్తే గ్రామాల్లో మరికొందరు సాగు చేసే అవకాశాలున్నాయి.

హాస్టల్ విద్యార్థులను పట్టించుకోని ప్రభుత్వం

● మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

● సైనిక్ స్కూల్ పరిశీలనకు వెళ్తుండగా అదుపులోకి తీసుకున్న పోలీసులు



సుంకె రవిశంకర్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

చొప్పదండి/రామడుగు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శనివారం చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ సైనిక్‌స్కూల్ పరిశీలనకు వెళ్తున్న రవిశంకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురుకుల బాటలో భాగంగా ఆయన సైనిక్ స్కూలు సందర్శనకు వెళ్తున్న క్రమంలో రుక్మాపూర్‌లో పోలీసులు అడ్డుకొని అరెస్టు చేసి రామడుగు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సంద ర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో విద్యార్థులకు చేయూతని చ్చేందుకు పలు సంక్షేమ హాస్టళ్లు ప్రారంభించామని చెప్పారు. ప్రస్తుత ముఖ్యమంత్రి విద్యార్థులను పట్టించుకోవడం లేదన్నారు ఇప్పటికైనా సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ప్రసాద్(ఫైల్)

తంగళ్లపల్లి, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం పద్మనగర్ గ్రామ శివారులోని శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పద్మనగర్‌కు చెందిన నాగిశెట్టి ప్రసాద్(36) ఉదయం వాకింగ్‌కు వెళ్లి సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా వెనకు నుంచి గుర్తు తెలియని కారు ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆటోలో జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతునికి భార్య మీనాక్షి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన ఇద్దరి మృతి

వీణవంక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన విద్యార్థి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేతిగల్ గ్రామానికి చెందిన వేముల సిద్దార్థ(21) హుజూరాబాద్ మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదవుతున్నాడు. రెండు నెలల నుంచి కళాశాలకు సరిగా వెళ్లడం లేదని తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెంది ఈ నెల 27న పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తండ్రి వేముల రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

పెద్దపల్లి మండలంలో..

పెద్దపల్లి రూరల్: మండలంలోని పెద్దకల్వల గ్రామానికి చెందిన బత్తుల శంకరయ్య(52) చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బత్తుల శంకరయ్య మద్యానికి బానిసై ఈ నెల 28న తన పత్తిచేనులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలుపగా పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య కొమురమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు. శంకరయ్యకు కూతురు, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

శంకరపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టులో చేపల కాపలాకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగట్టు గ్రామానికి చెందిన రెడ్డి శంకర్ (39) అనే వ్యక్తి ఈ నెల 23న కులవృత్తిలో భాగంగా అదే గ్రామానికి చెందిన ఎడ్ల మల్లయ్య, రేగుల రాజయ్యతో కలిసి రాత్రి చేపలు పట్టడానికి చెరువులో వేసిన వలలకు కాపలాగా వెళ్లారు. రాత్రి అక్కడ చెరువు వద్ద ఉన్నారు. తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లిన శంకర్ ప్రమాదవశాత్తు చెరువు కట్ట పక్కన కింద పడిపోయాడు. అతడి కేకలు వేయడంతో ఎడ్ల మల్లయ్య, రేగుల రాజయ్యలు అక్కడికి వెళ్లి చూడగా అతని తలకు గాయమైంది. శంకర్‌ను ఇంటికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. శంకర్ ప్రమాదవశాత్తు జారిపడడంతో తలకు గాయమై చికిత్స పొందుతూ మృతి చెందాడని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గంభీరావుపేటలో దొంగతనం

గంభీరావుపేట నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలోని దేవరాజు, మైసిరెడ్డి ఇళ్లలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఇండ్లకు తాళాలు వేసి ఈ రెండు కుటుంబాలు వేరే గ్రామానికి వెళ్లారు. రెండు ఇండ్లలో దొంగలు తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. దేవరాజ్ ఇంట్లో 10 వేలు నగదు, అర తులం బంగారం, 38 తులాల వెండి దొంగలు అపహరించారు, మైసిరెడ్డి ఇంట్లో దొంగలు తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించినప్పటికీ ఆ ఇంట్లో ఏమీ చోరీకాలేదు. ఇదిలా ఉండగా దొంగలు తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనానికి పాల్పడుతుండడంతో ప్రజలు భయాందోళన గురవుతున్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

జగిత్యాలరూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ శివారులో గల కమాన్ వద్ద ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన నలువాల భగత్(26) అనే యువకుడు మృతి చెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. భగత్ రాత్రి సమయంలో తన బైక్‌పై లక్ష్మీపూర్ నుంచి జగిత్యాలలోని గాంధీనగర్ లో గల తన అత్తగారింటికి బయల్దేరారు. లక్ష్మీపూర్ కమాన్ వద్ద భగత్ ప్రయానిస్తున్న బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో భగత్ తలకు బలమైన గాయాలై మృతిచెందినట్లు తెలిపారు.మృతుడి భార్య మధుమిత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నిరంజన్ (ఫైల్)

సుల్తానాబాద్, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సుల్తానాబాద్‌లో జరిగింది. ఎలిగేడు మండలంలోని బురాహన్ మియాపేటకు చెందిన గౌరు నిరంజన్ (35) అనే యువకుడు తన భార్య పిల్లలను చూడడానికి అత్తగారి గ్రామమైన సుల్తానాబాద్ మండలంలోని గట్టెపల్లికి ద్విచక్ర వాహనం పైనుంచి వెళ్తుండగా సుల్తానాబాద్-గట్టెపల్లి రోడ్డులో ఉన్న రైల్వే వంతెన సమీపంలో శనివారం తెల్లవారు జామున బైక్ అదుపుతప్పి ప్రమాదంలో నిరంజన్ మరణించాడని పోలీసులు తెలిపారు. నిరంజన్ రోడ్డుపై పడిపోయి ఉండగా కొందరు గమనించి 108లో సుల్తానాబాద్ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుని భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు నిరంజన్ ఎలిగేడు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏగా పనిచేస్తాడని భార్య ఫిర్యాదులో పేర్కొంది.

ఇంటర్నేషనల్ స్యాండ్ ఫెస్టివల్‌కు శంకర్ ఎంపిక

కరీంనగర్ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సా రాష్ట్రంలో జనవరి 1 నుంచి 5వ తేదీ వరకు జరిగే ఇంటర్నేషనల్ సాండ్ ఫెస్టివల్‌కు పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కలగూడూరు గ్రామానికి చెందిన రేవెల్లి శంకర్ ఎంపికయ్యారు. కరీంనగర్ మంకమ్మతోటలో నివాసముంటున్న శంకర్ వివిధ దేశాల నుంచి హాజరయ్యే ప్రసిద్ధ సైకత శిల్పుల సరసన వుమెన్ పవర్, ఎకోటూరిజం, క్రీడలు, కల్చరల్, ఎన్విరాన్‌మెంట్ అంశాలపై సైకత శిల్పాలను రూపొందించనున్నారు. 2022, 2023 సంవత్సరాల్లో కూడా ఇంటర్నేషనల్ సాండ్ ఫెస్టివల్‌లో పాల్గొని సైకత శిల్పాలను రూపొందించి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారు. ఆగస్టు 15న మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా ప్రతిభా పురస్కారం అందుకున్నారు. కాగా ఇంటర్నేషనల్ సాండ్ ఫెస్టివల్‌కు ఎంపికైన రేవెల్లి శంకర్‌కు పలువురు అభినందిస్తున్నారు.



ఒరిస్సాలో సైకత శిల్పాలను రూపొందించిన శంకర్ (ఫైల్)

హుజూరాబాద్‌లో రాష్ట్రస్థాయి హాకీ పోటీలు



హాకీ ఆడుతున్న క్రీడాకారులు

హుజూరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో అండర్-14 ఎస్‌జీఎఫ్ బాల బాలికల రాష్ట్రస్థాయి హాకీ పోటీలు శనివారం రెండో రోజూ కొనసాగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జయన్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గుడిపాటి జైపాల్‌రెడ్డి, సామాజిక కార్యకర్త వర్ధినేని రవీందర్‌రావు హాజరయ్యారు. క్రీడకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి పది జిల్లాలు రాష్ట్రస్థాయి హాకీ జట్లు పోటీపడ్డాయి. బాలికల విభాగంలో కరీంనగర్, నిజామాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల జట్లు సెమీఫైనల్‌కు చేరాయి. బాలుర విభాగంలో నిజామాబాద్, హైదరా బాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. కార్యక్రమంలో బి శ్రీనివాస్, టి శ్రీనివాస్, మధు, పీఈటీలు రాజిరెడ్డి, వేణుగోపాల్, సారయ్య, వి రవికుమార్, భాగ్యలక్ష్మి, అనిల్, శ్రీనివాస్, రేణుక ఉన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్



సమావేశమైన ధర్మపురి నియోజకవర్గ ఐద్వా సభ్యులు

ధర్మపురి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహిళలపై దాడులను అరికట్టాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ అన్నారు. ధర్మపురి పట్టణంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నియోజకవర్గ సమావేశం లావణ్య అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాంత్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు భద్రత భరోసా లేకుండా పోయిందన్నారు. మహిళలు పోరాడి అనేక చట్టాలు సాధించుకున్నప్పటికీ వాటిని అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. హత్యలు, అత్యాచారాలు చేసిన వారిపై కఠిన చర్యలు వెంటనే తీసుకోకుండా ఏళ్ల తరబడి కేసులు పరిష్కారం కాకుండా రాజకీయ నాయకులు అండతో బాధితులకు న్యాయం జరగడం లేదని తెలిపారు. స్త్రీల హక్కుల కోసం ఐద్వా నిర్విరామ కృషి చేస్తూ మహిళా సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాటాలు చేస్తోందని ఆయన అన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ కమిటీ కన్వీనర్‌గా అద్దరి కవిత, కోకన్వీనర్లుగా లావణ్య, సరోజ, ఏడుగురు కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కో కన్వీనర్ కోమిటి చంద్రశేఖర్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి గర్వంతుల రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల సురేష్ పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

● డ్రగ్స్ పార్సల్, బ్యాంక్ రుణం, క్రెడిట్ కార్డు, ఉద్యోగాల పేరిట మెస్సేజ్‌లతో మోసాలు

● కమిషనరేట్‌లో 220 కేసులు, 15 మంది అరెస్టు ● 197 కేసుల్లో రూ. 1.09 కోట్లు రికవరీ

కరీంనగర్ క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హలో.... మీ పేరు పద్మనా.... ఎయిర్‌పోర్ట్ నుంచి కస్టమ్స్ అధికారిని మాట్లాడుతున్న... మీ పేరిట పార్సల్ వచ్చింది. అందులో డ్రగ్స్, నకిలీ పాస్‌పోర్ట్‌లున్నాయి. అంటూ ఇటీవల కరీంనగర్‌కు చెందిన ఒక మహిళకు గుర్తుతెలియన వ్యక్తి వాట్సప్ కాల్ చేశాడు. దీంతో ఆ మహిళ భయపడిపోయింది. దీనిని ఆసరగాగా తీసుకున్న సైబర్ నేరగాడు.. మీపై సైబర్ క్రైం నమోదవుతుందని చెప్పాడు. కాన్ఫరెన్స్ ద్వారా సైబర్ క్రైం పోలీసు అధికారిని మాట్లాడుతన్నాడంటూ మరో వ్యక్తి లైన్‌లోకి వచ్చాడు. మీపై సైబర్ క్రైం నమోదైంది. డిజిటల్ అరెస్టు చేస్తున్నాం.... కేసు నుంచి బయట పడాలంటే ఈ విషయం ఎవరికి చెప్పకుండా. కొంత డబ్బులు మేము చెప్పిన బ్యాంక్ ఖాతాకు జమచేయాలి అని చెప్పాడు. భయపడిపోయిన ఆ మహిళ తన ఖాతా నుంచి రెండు విడతలుగా 21.66 లక్షల రూపాయలు ట్రాన్స్‌ఫర్ చేసింది. మరుసటి రోజు అనుమానం వచ్చిన బాధితురాలు కరీంనగర్ సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటికే ఆ అకౌంట్ నుంచి డబ్బులు అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ అయినట్లు సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు.చివరకు ఆ అకౌంట్ యజమానిని అరెస్టు చేశారు.

● కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఉద్యోగికి ఒక రోజు వాట్సప్‌కాల్ వచ్చింది. ఆ వాట్సప్‌లో పోలీసు యూనిఫాం ధరించిన అధికారి ఫొటో ఉంది. ఆ వ్యక్తి మాట్లాడుతూ హైదరాబాద్‌లో మీ కూతురు వద్ద డ్రగ్స్ పట్టుకున్నాము. సైబర్ క్రైం నమోదైంది.. డిజిటల్ అరెస్టు చేస్తాం అంటూ బెదిరించాడు. గంట ముందే ఆ ఉద్యోగి తన కూతురుతో మాట్లాడాడు. అటువంటిది ఏమీ లేదని, ఆ వాట్సప్‌కాల్ ఫేక్‌గా పసిగట్టి స్పందించకుండా కాల్ కట్ చేశాడు.

● ఎన్నో రకాల మోసాలు

ఈ విధంగా సైబర్ నేరగాళ్లు అనేక రకాలుగా డ్రగ్స్ పార్సల్, న్యూడ్ వీడియోకాల్స్, ఏపీకే ఫైల్స్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, షేర్ మార్కెట్, పిల్లలను అరెస్టు చేస్తున్నామంటూ కాల్స్ చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతూ కోట్లు కొల్లగొడుతున్నారు. ప్రస్తుత ఆధునిక యుగంలో శాస్త్ర, సాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధించినప్పటికీ



అదే స్థాయిలో అదే సాంకేతికతో మోసాలు చేస్తున్న నేరగాళ్లు పెరుగుతున్నారు. సైబర్ మోసగాళ్లు మొదట్లో ఏటీఎం కార్డుల పిన్ నంబర్, ఓటీపీ, కార్డులను మార్చి, ఫ్రాడ్ మెస్సేజ్, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాల ద్వారా డబ్బులు కొట్టేసేవారు. ఇటీవల డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారు.

● రూ. కోట్లు కోల్పోయిన బాధితులు

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరగాళ్లబారినపడి కోట్ల రూపాయలు పోగొట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదుల మేరకు ఇప్పటి వరకు కరీంనగర్ సైబర్ క్రైం పోలీసు ఠాణాలో 220 కేసులు నమోదు అయ్యాయి. ఇందులో 197 కేసుల్లో 15 మంది నిందితులను అరెస్టు చేశారు. 1.09 కోట్ల రూపాయలు సైబర్ క్రైం పోలీసులు రికవరీ చేశారు. సైబర్ నేరగాళ్లు ఫేక్ ఖాతా(మూల్ అకౌంట్) ద్వారానే బాధితుల నుంచి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసుకుంటూ చిక్కకుండా పోతున్నారు.

● మూల్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్

సైబర్ నేరగాళ్లు ముందుగా ఒక వ్యక్తి గుర్తింపు కార్డుతో ఒక బ్యాంక్ ఖాతాను తెరిపించి, ఆ వ్యక్తికి ఐదు వేల రూపాయలు ముట్టచెబుతున్నారు. తరువాత ఖాతా బుక్కు, ఏటీఎం కార్డు వెంట తీసుకువెళతారు. సైబర్ నేరాలకు తన ఖాతాను ఉపయోగిస్తున్న విషయం ఆ వ్యక్తికి తెలియదు. సైబర్ క్రైం నమోదైన తరువాత పోలీసులు విచారణ చేపట్టడంతో మొదట డబ్బులు ఏ ఖాతాకు బదిలీ అయ్యిందనే విషయాన్ని గుర్తిస్తారు. సాంకేతికపరంగా ఖాతా కలిగిన వ్యక్తిపైనే కేసు నమోదవుతుంది. ఇటువంటి అకౌంట్‌ను మూల్ అకౌంట్ అంటారు. సైబర్ నేరాలకు నేరస్థులు ఉపయోగించే బ్యాక్ ఖాతాలు మూల్ ఖాతాలే కారణమని సైబర్ క్రైం పోలీసులు చెబుతున్నారు. ఈ మూల్ ఖాతాల నుంచి డబ్బులను ఇతర సంస్థలకు బదిలీ చేసుకుంటున్నారు.

● డిజిటల్ అరెస్ట్..

వీడియో కాల్, స్కైప్, వాట్సప్ కాల్ ద్వారా అమాయకులకు సైబర్ నేరస్థులు కాల్ చేసి తాము కస్టమ్స్ అధికారులమని, నార్కోటిక్, పోలీసులు, సీబీఐ, ఈడీ, సైబర్‌క్రైం అధికారులమంటూ నకిలీ గుర్తింపు కార్డులు, నకిలీ అరెస్టు వారెంట్లు చూపెడుతూ నమ్మిస్తున్నారు. కేసుల పేరుతో భయపెట్టి డబ్బులు దండుకుంటున్నారు. పన్నుల ఎగవేత, డబ్బుల దుర్వినియోగం వంటి కారణాలను చూపెడుతూ అమాయకులను భయపెడుతున్నారు. సైబర్ నేరగాళ్లు పోలీసు అధికారులమని చెబుతూ నమ్మించేందుకు పోలీసు స్టేషన్లలా కనిపించే గదుల్లో కూర్చుని వీడియోలో కనిపించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. తాము విచారణలో సహకరిస్తామని, కేసులో పేరు లేకుండా చేస్తామని, కొంత డబ్బులు చెల్లించాలని నమ్మబలికి వారి బ్యాంకు ఖాతాలకు లేదా యూపీఐ ఐడీలకు డబ్బులను బదిలీ చేయించుకుంటారు.

● అవగాహన పెంచుకోవాలి

సైబర్ మోసాలపై ప్రజలు అవగాహ కలిగి పెంచుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. బ్యాంక్ ఖాతా, పిన్, ఆధార్, ఓటీపీ తదితర సమాచారాన్ని ఇతరులకు ఎట్టిపరిస్థితుల్లో చెప్పవద్దని వారంటున్నారు. నిజమైన పోలీసు, కస్టమ్స్, సీబీఐ, ఈడీ వంటి శాఖల ప్రభుత్వ అధికారులు డబ్బులు చెల్లించాలని, బ్యాంక్ ఖాతా వివరాలు అడగరనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని సూచిస్తున్నారు. డిజిటల్ అరెస్టు అనేది ఉండదని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఓ ప్రకటన జారీ చేసింది. ప్రజలు ఈ విషయాలన్నీ గమనించాలని పోలీసులు సూచిస్తున్నారు.

చిన్నారిని చిదిమేసిన నిర్లక్ష్య డ్రైవింగ్

సుల్తానాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు చిన్నారి తనువుచాలించింది. సుల్తానాబాద్ మండలంలోని కదంబాపూర్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం కాశెపల్లిలో శనివారం ఫరీదా - రాజ్ మహ్మద్ దంపతులు కూతురు ఏడాదిన్నర వయసు గల రఫీద తమ ఇంటి ఎదుట ఆడుకుంటోంది. ఈ ఇంటి ఎదురుగా ఉన్న షకీల్ అనే వ్యక్తి తన బోలెరో వాహనాన్ని స్టార్ట్ చేసి వెళ్లే క్రమంలో వాహనం వెనక వైపు ఉన్న ఏడాదిన్నర పాపను గమనించలేదు. దాంతో వాహనం పాపపై నుంచి వెళ్లడంతో పాప మృతి చెందింది. చిన్నారి తండ్రి రాజ్‌మహ్మద్ బతుకు తెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. తల్లి ఫరీదా కన్నీరు మున్నీరవుతోంది. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీపాదకాలనీలో పోలీసుల కార్డన్ సెర్చ్

మంథని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని శ్రీపాదకాలనీలో సీఐ రాజు, ఎస్ఐలు రమేష్, చంద్రకుమార్, నరేష్‌ల ఆధ్వర్యంలో పోలీసులు శనివారం పోలీసులు కార్డన్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనాలను గుర్తించి చాలన్ వేశారు. యువత మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని, ఇలాంటి సమాచారాన్ని పోలీసులకు ఇవ్వాలని సీఐ రాజు సూచించారు.

రోలర్ స్కేటింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఇద్దరు చిన్నారులు జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యారు. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లో ఈ నెల 5 నుంచి 10 తేదీ వరకు జరిగే 62 జాతీయస్థాయి సబ్ జూనియర్ రోలర్ స్కేటింగ్ పోటీలకు జిల్లాకు చెందిన పట్నాన శ్రీహన్సి, ఏ అమృత వర్షిణి ఎంపికయ్యారు. అక్టోబర్ 4 నుంచి 8వ తేదీ వరకు భువనగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల రోలర్ స్కేటింగ్ పోటీల్లో విశేష ప్రతిభ చాటిన శ్రీహన్సి 9-11 సంవత్సరాల వయస్సు విభాగంలో, అమృత వర్షిని 5-7 సంవత్సరాల వయస్సు విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కోచ్ గట్టు అనిల్ కుమార్, అసిస్టెంట్ బి నరహరి తెలిపారు.

హోటల్ గదిలో డబ్బులు మాయం

కరీంనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వీపార్క్ హోటల్లో తనకు చెందిన 4.5 లక్షల రూపాయలు చోరీకి గురయ్యాయని రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన పూడూరు మల్లేశం శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు మల్లేశం 28న వీ పార్క్ హోటల్‌లో రూమ్ అద్దెకు తీసుకొని ఉన్నాడు. రూం నుంచి బయటకు వెళ్లి వచ్చేసరికి బ్యాగులోని 4.5 లక్షల రూపాయలు చోరీకి గురయ్యాయని కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కరీంనగర్ జోన్ ఈడీగా బాధ్యతలు చేపట్టిన ఖుస్రోషాఖాన్



భగత్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీగా ఖుస్రోషాఖాన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం రీజియన్ల డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. నూతన ఈడీ ఖుస్రోషాఖాన్‌ను డిప్యూటీ రీజినల్ మేనేజర్లు కె సత్యనారాయణ, ఎస్‌భూపతిరెడ్డి, డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ ఎ విలాస్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోచయ్యలింగం, పర్సనల్ ఆఫీసర్ ఎంచంద్రయ్య, ఈడీ కార్యదర్శి యుగంధర్‌రెడ్డి, కరీంనగర్-1, 2 డిపో మేనేజర్లు విజయమాధురి, వి మల్లయ్య, కరీంనగర్ బస్‌స్టేషన్ అసిస్టెంట్ మేనేజర్ సురేష్, లా ఆఫీసర్ రజనీకృష్ణ, బస్‌స్టేషన్ మేనేజర్ అంజయ్య స్వాగతం పలికారు. వరంగల్, ఖమ్మం రీజినల్ మేనేజర్లు విజయభాను, సరిరాం, జోనల్ వర్క్‌షాప్ మేనేజర్ సుగుణాకర్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జోన్ పరిధిలో స్థితిగతులపై ఈడీ ఖుస్రోషాఖాన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.


ముగిసిన సీపీఎం మహాసభలు

భగత్‌నగర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో నిర్వమిస్తున్న సీపీఎం జిల్లా మహాసభలు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా మిల్కూరి వాసుదేవరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా గీట్ల ముకుందరెడ్డి, వర్ణ వెంకటరెడ్డి, గుడికందుల సత్యం, జి బీమా సాహెబ్, జిల్లా కమిటీ సభ్యులుగా యు శ్రీనివాస్, సంపత్, ఎడ్ల రమేష్, వెల్మారెడ్డి, రాజిరెడ్డి, శీలం అశోక్, డి నరేష్ పటేల్, జి రాజేశం, కోనేటి నాగమణి, కొప్పుల శంకర్, కో-అప్షన్‌సభ్యులుగా 15 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదిర్శవర్గ సభ్యులు టి జ్యోతి, రాష్ట్ర కమిటీ సభ్యులు జె వెంకటేష్ తదితరులు తెలిపారు. ఎన్నికైన సభ్యులు పార్టీ పరిష్టతకు పాటుపడాలని కోరారు.

ఆకట్టుకుంటున్న షాడో చిత్రాలు

ఇంట్లోని వృథా వస్తువులతో ప్రదర్శన

- ఇల్లంతకుంట యువకుడి ప్రతిభ
- ఆర్ట్ విభాగంలో జాతీయ పురస్కారం



ఇంట్లోని వస్తువులతో వినాయకుడి చిత్రం



అమ్మవారి చిత్రం



పాలతో గీసిన సాయిబాబా చిత్రం



చక్కెరతో గీసిన మదర్‌థెరిసా చిత్రం



పెన్నుతో గీసిన యువతి చిత్రం

ఇల్లంతకుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వృథా అనుకునే వస్తువులకు తన కళను జోడించి అబ్బురపరుస్తున్నాడు రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలకేంద్రానికి చెందిన సాన అనీల్‌కుమార్. చిన్ననాటి నుంచి సమాజంలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు ఉండాలనది అనిల్ అభిప్రాయం. అదే లక్ష్యం విభిన్న కళాకారుడిగా మార్చింది. తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో మొదట్లో పెన్సిల్, పెన్నులతో చిత్రాలు గీయడం ప్రారంభించాడు. అతడిని ప్రతిభను గుర్తించి పలువురు ప్రశంసించడంతో ఇంకా భిన్నంగా చేయాలని ప్రయత్నించాడు. ఇంట్లోని వస్తువులను ఒకదాని పక్కన మరొకటి చేర్చి వాటిపై వెలుతురు పడేలా చేసి షాడో (నీడ) చిత్రాలను ప్రదర్శించడం మొదలుపెట్టాడు. దీంతో సాన అనీల్ పేరు షాడో అనీల్‌గా మారింది. ఇంతేకాక పాలతో గాంధీ, చక్కెరతో మదర్‌థెరిసా, ఇసుకతో చెగువేరా చిత్రాలు వేశాడు. సుద్ద ముక్క, చీపురుపుల్లలతో పలు కళారూపాలు రూపొందించాడు. 2006లో చిత్రలేఖనం పోటీలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొదటి స్థానం, 2008లో క్రియేటివ్ పెయింటింగ్‌లో రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి, 2015లో ఉత్తమ యువపురస్కార్ అందుకున్నాడు. 2015లో లండన్‌లో జరిగిన ఫిల్మ్‌ఫెస్టివల్‌కు ఆన్‌లైన్ ద్వారా జరిగిన పోటీలలో 7వస్థానంలో నిలిచాడు. 2016లో అమెరికాలో జరిగిన ఆర్ట్ సెలక్షన్‌లో భాగంగా 200 డాలర్స్ ప్రైజ్‌మనీని సొంతం చేసుకున్నాడు. 2020లో విశాఖపట్టణంలో జరిగిన నార్త్‌ఢిల్లీ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ అవార్డు అందుకున్నాడు. అనీల్ రూపొందించిన షాడో ఆర్ట్‌కు ఢిల్లీలో రూ.లక్ష రెమ్యూనరేషన్ సొంతం చేసుకున్నాడు. పలువురి ప్రశంసలు అందుకుంటున్నాడు.

ప్రత్యేక గుర్తింపు

- సాన అనిల్‌కుమార్, ఇల్లంతకుంట



విభిన్నమైన కళలతో ముందుకు పోతుండడంతో సమాజంలో ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తోంది. చిన్ననాటి నుంచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సాహం అందించారు. ఇప్పటి వరకు పెన్సిల్, పెన్నులతో 150 వరకు చిత్రాలు గీసాను. నాణేలతో వివేకానందుని చిత్రం, సుద్దముక్కలు, చీపురుపుల్లలతో వివిధ కళాకృతులు రూపొందించాను. అయితే షాడో చిత్రాలతో మంచి గుర్తింపు లభించింది. భవిష్యత్‌లో మరింత రాణించడానికి నిరంతరం ప్రయత్నిస్తున్నాను.

నేడు పెద్దపల్లికి మంత్రి ఉత్తమ్ రాక

- ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులు, సివిల్ సప్లయ్‌పై సమీక్ష
- సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

పెద్దపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి డిసెంబరు 1వ తేదీన పెద్దపల్లికి రానున్నారు. ఆయన మధ్యాహ్నం 12 గంటలకు తన నివాసం నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుని మధ్యాహ్నం 1:30 గంటలకు పెద్దపల్లికి రానున్నారు. 1:30 నుంచి 3 గంటల వరకు ఉమ్మడి జిల్లా పరిధిలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సంబంధిత అధికారులతో చేపట్టిన ప్రాజెక్టులు, చెక్ డ్యామ్‌ల పనులు, వాటి పరిస్థితి, కొత్తగా చేపట్టాల్సిన ప్రాజెక్టులు, రిజర్వాయర్లపై సమీక్ష చేయనున్నారు. అలాగే పౌర సరఫరాల శాఖ ద్వారా చేపట్టిన ధాన్యం కొనుగోళ్లు, డబ్బుల చెల్లింపు, రైతుల ఖాతాల్లో రూ.500 బోనస్ జమ, సీఎంఆర్, రేషన్ షాపుల నిర్వహణ, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. నవంబరు 19న రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో నిర్వహించిన సీఎం సభలో కాళేశ్వరం ప్రాజెక్టు, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుల నిర్మాణాల్లో భాగంగా ఇప్పటి వరకు పెండింగులో ఉన్న పలు ప్యాకేజీల పనులు, రైతులకు పూర్తి స్థాయిలో సాగు నీటిని అందించేందుకు ఉమ్మడి జిల్లాలో చేపట్టాల్సిన పనుల గురించి వారం, పది రోజుల్లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఆ మేరకు ఆదివారం సమావేశాన్ని పెద్దపల్లి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. సమీక్ష అయిన తర్వాత కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలో 4వ తేదీన నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు నాయకులు పరిశీలించనున్నారు.

పెద్దపల్లిలో సీఎం సభకు అధికారుల కసరత్తు

- రూ.378 కోట్ల పనులకు శంకుస్థాపన
- 9007 మంది గ్రూప్4, అసిస్టెంట్ సివిల్ సర్జన్, సింగరేణి ఉద్యోగులకు నియామక పత్రాల పంపిణీ
- అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్

పెద్దపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా డిసెంబర్ 4న పెద్దపల్లిలో నిర్వహించనున్న యువత విజయోత్సవ సభకు అధికారుల కసరత్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లాలో 378 కోట్ల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. 9007 మంది గ్రూప్ 4, అసిస్టెంట్ సివిల్ సర్జన్, సింగరేణిలో ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలను అందజేయనున్నారు. హైదరాబాద్‌లో చేపట్టే స్కిల్ యూనివర్శిటీలో భాగస్వామ్యం అయ్యే ఏడు ఏజెన్సీలతో ఒప్పంద పత్రాలపై సంతకం చేయనున్నారు. డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజ్‌తో పాటు సీఎం కప్‌ను ప్రారంభించనున్నారు. మరిన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసే అవకాశాలు ఉన్నాయి. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టరేట్‌లోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారని, ఇక్కడ నుంచి బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకునేందుకు ప్రొటోకాల్ ప్రకారం ముఖ్యమంత్రి కాన్వాయ్ సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలో రోడ్లు భవనాల శాఖ ద్వారా 266 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా 66 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు, 10 కోట్లు వెహికల్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు, 26 కోట్ల నర్సింగ్ కళాశాల, 10 కోట్లు శాతవాహన కళాశాల అకాడమిక్ బ్లాక్ నిర్మాణ పనుల శంకుస్థాపన ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సీఎం సభాస్థలి వద్ద ఏర్పాటు చేసే స్టాళ్లను ఫైనల్ చేయాలని ఆర్డీఓకు సూచించారు. సీఎం వేదికపైకి చేరుకొని జ్యోతి ప్రజ్వలన చేస్తారని, రాష్ట్ర గేయం వస్తుందని తెలిపారు. సభలో రాష్ట్ర ముఖ్య కార్యదర్శి, మంత్రుల సందేశాలు ఉంటాయని, తర్వాత ఎంపిక చేసిన 10 మంది అభ్యర్థులకు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాల పంపిణీ చేయనున్నారని, డిప్యూటీ సీఎం, ముఖ్యమంత్రి సందేశాలతో కార్యక్రమం ముగుస్తుందని అన్నారు. సభావేదిక పై ఉండే వీవీఐపీలు, వీఐపీలు, ఇతర నాయకులు, ఉన్నతాధికారుల జాబితా ముందుగానే తయారు చేసి పోలీస్ శాఖకు అందజేయాలని కలెక్టర్ తెలిపారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష

సభా వేదికపై ఉన్న ప్రతి కుర్చీలో ఎవరు కూర్చునేది స్పష్టంగా తెలియజేస్తూ ఏర్పాట్లు చేయాలని అన్నారు. సభా ప్రాంగణం వద్ద అవసరమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో రుణమాఫీ, బోనస్ వచ్చిన రైతులు, మహిళ సంఘాల సభ్యులు సీఎం సభకు వచ్చేలా సమీకరణ చేయాలన్నారు. వారికి భోజనం బస్సు వద్దనే అందించాలన్నారు. సీఎం కార్యక్రమానికి విధులు నిర్వహించే సిబ్బందికి గుర్తింపు కార్డులు అందజేయాలని కలెక్టర్ పరిపాలన అధికారికి సూచించారు. సీఎం సభకు వచ్చే ప్రజలు, అభ్యర్థులు, రైతులు వివిధ వర్గాల ప్రజలకు అవసరమైన తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఆకట్టుకున్న ఒగ్గు డోలు ప్రదర్శన

- ఒడిశాలో జాతీయ నృత్య ఉత్సవాల్లో తాడిజెర్రి కళాకారులు



ప్రదర్శన ఇస్తున్న తాడిజెర్రి ఒగ్గుడోలు కళాకారులు

గంగాధర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలో గంగాధర మండల తాడిజెర్రి ఒగ్గుడోలు కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంటుంది. ఒడిశాలోని భవాణి పాట్నా అంబేద్కర్ స్టేడియంలో భారత సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ 2024 గిరిజన జానపద సంప్రదాయ నృత్య మహోత్సవం నవంబరు 29 నుంచి డిసెంబరు 1 వరకు నిర్వహిస్తోంది. ఇందులో భాగాంగా గంగాధర మండలం తాడిజెర్రికి చెందిన మల్లికార్జున ఒగ్గు కళా సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలు కోలాటం, పురుషుల బృందం ఒగ్గుడోలు ప్రదర్శనకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

రెండు రోజులుగా తాడిజెర్రి కళాకారులు నిర్వహిస్తున్న ప్రదర్శనలను దేశం నలుమూలల నుంచి వచ్చిన అధికారులు, కళారులు ప్రసంశిస్తున్నట్లు బృంద నాయకుడు ఏగుర్ల మహిపాల్ తెలిపారు.

అఖిల భారత బ్యాడ్మింటన్ పోటీల చాంపియన్‌గా సింధు



సింధు సాధించిన ట్రోఫీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత జోనల్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల చాంపియన్‌గా జిల్లాకు చెందిన సింధు నిలిచింది. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఆలిండియా జోనల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సింధురెడ్డి సింగిల్స్ డబుల్ విభాగాల్లో విశేష ప్రతిభచాటి చాంపియన్‌షిప్‌ను సాధించింది. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో ఇటీవల నిర్వహించిన జోనల్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లాలోని విద్యానగర్‌కు చెందిన సింధూరెడ్డి నాలుగేళ్ల సుదీర్ఘ విరాం తర్వాత సింగిల్స్, డబుల్ విభాగాల్లో చాంపియన్‌షిప్ సాధించింది. సింధూరెడ్డి శంషాబాద్‌లోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా సింధును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సన్మానించారు. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గంగావత్ వెంకన్న, జిల్లా యువజన క్రీడాశాఖాధికారి శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు.

ధర్మపురిలో వైభవంగా గోదావరి మహా హారతి

- కార్తీకమాసం చివరివారం ఆలయాల్లో భక్తుల రద్దీ



ధర్మపురి వద్ద గోదావరికి మహా హారతి ఇస్తున్న పీఠాధిపతి అతిథేశ్వరానంద , పొల్సాని



వేములవాడ రాజన్న ఆలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

ధర్మపురి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో గోదావరి మహా హారతి కార్యక్రమాన్ని శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. రాత్రి వేళలో అనేక మంది భక్తులు, మహిళలు, ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ కార్యకర్తలు వెంటరాగా విశ్వహిందూ మహా సంఘ్ భారత్, శ్రీలంక అద్వైత పీఠాధిపతి అతిథేశ్వరానంద పర్వత, గోదావరి మహా హారతి ఉత్సవ సమితి వ్యవస్థాపక చైర్మన్ పోల్సాని మురళీధర్‌రావు మొదట గోదావరి నదికి పూజలు నిర్వహించారు. అనంతరం వారు గోదావరికి మహాహారతి సమర్పించారు. మహిళలు, యువతులు, విద్యార్థినులు నదిలో దీపాలను వదిలారు. కార్యక్రమంలో గోదావరి హారతి రాష్ట్ర కన్వీనర్ లింగంపెల్లి వీర గోపాల్, కో కన్వీనర్లు దామెర రాంసుధాకర్‌రావు, బలుమూరి సంతోష్‌రావు, పాపారావు, హనుమాన్ సేవ సమితి అధ్యక్షుడు సాయిరెడ్డి, జగిత్యాల జిల్లా కన్వీనర్ పిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని విశ్వహిందూ మహా సంఘ్ భారత్, శ్రీలంక అద్వైత పీఠాధిపతి అతిథేశ్వరానంద పర్వత స్వామిజీ, గోదావరి మహా హారతి ఉత్సవ సమితి వ్యవస్థాపక చైర్మన్ పోల్సాని మురళీధర్ రావు దంపతులు వేర్వేరుగా సందర్శించారు.

- కార్తీకమాసం చివరివారం కావడంతో శనివారం ధర్మపురి క్షేత్రంలో శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరించారు. నవ దంపతులు గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకున్నారు. అనేక మంది మహిళలు నదిలో కార్తీక దీపాలు వదిలారు. భక్తులు ఆలయాలకు చేరుకుని అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహ హోమం, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. ఆలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు చుట్టూ ప్రదక్షిలు చేసి కార్తీక దామోదరుడిని పూజించారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండదీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ధర్మపురి క్షేత్రంలో 29వ రోజు శనివారం గోదావరి హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

రాజన్న ఆలయంలో..

వేములవాడ కల్చరల్: కార్తీక మాసం చివరివారం కావడంతో వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. భక్తులు శ్రీరాజరాజేశ్వర స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. ఆలయంలోకి చేరుకున్న భక్తులు శ్రీపార్వతి పరమేశ్వరులను దర్శించుకుని తరించారు. కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలోని పార్కింగ్ స్థలంలో శ్రీకాళీ వారాహీ త్రిశక్తి పీఠం గురువు బ్రహ్మశ్రీ నవీన్‌శర్మ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు సంకెపల్లి సుదీర్‌రెడ్డి రాజన్న ఆలయానికి రావ డంతో అధికారులు స్వాగతం పలికారు. శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ రాజన్న దర్శనానికి వచ్చారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిదానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు కొండపైకి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బేతాళుడి వద్ద కూడా పూజలు చేశారు. ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్ సిబ్బంది పర్యవేక్షించారు.

'మధ్యాహ్న భోజన విధులను ఉపాధ్యాయులకు ఇవ్వవద్దు'

సిరిసిల్ల రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన తయారీలో ఉపాధ్యాయులకు విధులను నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో పాటు పెండింగ్ బిల్లులను చెల్లించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీలకు ఓటు హక్కు కల్పించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం రాత్రి టీపీటీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ అధ్వర్యంలో టీపీటీఎఫ్ బాధ్యుల సమా వేశాన్ని నిర్వహించారు. ఈసమావేశానికి హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మాదిరిగా విద్యాశాఖకు సంబంధించిన అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన విధులకు ఉపాధ్యాయు లను సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తున్నా మని అన్నారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బిల్లులు సరిగా మంజూరు చేయకుండా సరైన వసతులు కల్పిం చకుండా కేవలం ఉపాధ్యాయులను బాధ్యు లను చేస్తూ సస్పెండ్ చేయడం సరైన విధానం కాదన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శినన్నబోయిన తిరుఎతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పాతూరి మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దుమాల రాంనాథ్‌రెడ్డి, విక్కుర్తి అంజయ్య, నాయకులు కిషన్‌రావు, పంజాల వెంకన్న, పురం వాసుదే వరావు, దబ్బెడ హన్మాండ్లు, నూగురి దేవేందర్, మందాడి శ్రీనివాసరెడ్డి, రజని రాణీ, తిరుపతి, మైలారం తిరుపతి, చకినాల రామచంద్రం, ఎడ్ల కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం ఉదయం 9:30 నుంచి 11:30 వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు, రూరల్ ఏడీఈలు లావణ్య, రఘులు తెలిపారు. కార్పెంటర్ సొసైటీ, సంతోషిమాత, హనుమాన్ దేవాలయం, పల్లవి పిల్లల ఆసుపత్రి, గీతాభవన్ వెనుక వైపు ప్రాంతం, కొత్తలేబర్ అడ్డా, భాగ్యనగర్, రాయల్ ఎలైట్ అపార్ట్‌మెంట్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అల్కాపురి కాలనీ, కోతిరాంపూర్ ప్రధాన రహదారి, గణేష్‌నగర్ బైపాస్, వసంత్‌వ్యాలీ పాఠశాల ప్రాంతం, రూరల్ ప్రాంతంలో ఉదయం 9:30 నుంచి 11:30 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

● సంక్షిప్త సమాచారం..

●కరీంనగర్ రూరల్: తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం కరీంనగర్ రూరల్ మండల అధ్యక్షుడిగా రాజశేఖర్ ఎన్నికయ్యారు.

●గ్రామాల్లో దళితులపై వివక్ష చూపితే చర్యలు ఉంటాయని కరీంనగర్ మండల రెవెన్యూ అధికారి వాస్తవిక్ అన్నారు. శనివారం కరీంనగర్ మండలం తహెర్ కొండాపూర్‌లో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి పాల్గొన్నారు.

●కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని సీసీఎస్‌లో పనిచేస్తూ శనివారం పదవీ విరమణ పొందిన ఏఎస్ఐ రఘుపతిరెడ్డిని సీపీ అభిషేక్ మొహంతి సత్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లక్ష్మినారాయణ, ఆర్ఐ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

●భగత్‌నగర్: సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నక్క బాల మల్లేష్ గుండెపోటుతో మృతి చెందడం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు.

●సుభాష్‌నగర్: ఉద్యోగ విరమణ పొందిన కటకం ఆనందం, అసదుద్దీన్, రౌతు లక్ష్మయ్యను టీఎన్‌జీవో సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణరావు పాల్గొన్నారు.

●కరీంనగర్ కల్చరల్: మార్గశిర మాసం సోమవారం నుంచి ప్రారంభం కానుంది. డిసెంబరు 26వ తేదీ వరకు ముహూర్తాలున్న ఈ మాసంలో శుభకార్యాలు జరగనున్నాయి.

●కరీంనగర్ నుంచి గడప నాగరాజు గురుస్వామి ఆధ్వర్యంలో అక్టోబరు 17న బయలు దేరిన మహాపాదయాత్ర బృందం శనివారం శబరిమలకు చేరుకుంది. సన్నిధానంలో అయ్యప్ప స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం




కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తిలో, శంకరపట్నం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు నాలుగో విడతలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసినందుకు మండలంలోని చేగుర్తి గ్రామంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో సంబరాలను నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జి పురమల్ల శ్రీనివాస్ హాజరై సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

●మండలంలోని చామనపల్లి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం బహిరంగసభను లైవ్‌లో వీక్షించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి సత్యంతో పాటు, ఏఈవోలు పైడితల్లి, సుచరిత, అనూష, స్వర్ణలత, ఉదయ్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి పాల్గొన్నారు.

●శంకరపట్నం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు కాంగ్రెస్ మండల నాయకులు శనివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కేశవపట్నం రైతు వేదికలో సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బసవయ్య, హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి పాల్గొన్నారు.

●ఇల్లందకుంట: మండల కేంద్రంలోని రైతు వేదికలో సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వంగ రామకృష్ణ, ఉప్పుల శ్రీనివాస్‌రెడ్డి, పెద్ది కుమార్, ఓదెలు, గోపాల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, సతీష్‌గౌడ్, తిరుపతిరెడ్డి, రమేష్, మల్లారెడ్డి, రాజిరెడ్డి, పరమేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

●సైదాపూర్: మహబూబ్‌నగర్‌లో శనివారం నిర్వహించిన రైతు పండుగ కార్యక్రమాన్ని సైదాపూర్ రైతు వేదిక నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో మండల రైతులు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

●వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామంలోని రైతు వేదిక కార్యాలయంలో మహబూబ్‌నగర్ జిల్లాలో జరుగుతున్న రైతు వేడుకను స్థానిక రైతులు వీక్షించారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ కర్ర భగవాన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎక్కటి రఘుపాల్‌రెడ్డి, జమ్మికుంట మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కామిడి శ్రీపతిరెడ్డి, నల్లగొని సతీష్, తిరుపతిగౌడ్, నాయకులు చోడ రవీందర్‌రెడ్డి, జరుతుల రాంరెడ్డి, రాజిరెడ్డి, ఏవో గణేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు

కరీంనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): డిసెంబర్ 1 నుంచి డిసెంబర్ 9 వరకు ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 1న విద్యా శాఖ ఆధ్వర్యంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల రెండవ దశ నిర్మాణాల శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహిస్తామని, సీఎం కప్ పేరిట క్రీడా పోటీలు ఉంటాయన్నారు. డిసెంబర్ 2న నర్సింగ్ కాలేజీలు, పారా మెడికల్ కళాశాలలను, నూతన అంబులెన్స్‌లు, ట్రాన్స్‌జెండర్‌ల క్లినిక్‌లు ప్రారంభిస్తారని అన్నారు. డిసెంబర్ 3న మున్సిపల్ కార్మికులకు హెల్త్ క్యాంప్‌లు నిర్వహిస్తామన్నారు. 4న పెద్దపల్లి జిల్లాలో సీఎం బహిరంగ సభ ఉంటుందన్నారు. డిసెంబర్ 5న ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం విజయాలపై శివశక్తి మహిళా సంఘాలలో చర్చ నిర్వహించాలని అన్నారు. డిసెంబర్ 6న సబ్ స్టేషన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన ఉంటుందని అన్నారు. 7న విద్యుత్ శాఖకు నూతన ఎమర్జెన్సీ రెస్పాన్స్ వాహనాలు ప్రారంభిస్తామని అన్నారు. 8న ఏఐ నగరానికి శంకు స్థాపన ఉంటుందన్నారు. డిసెంబర్ 9న హైదరా బాద్‌లోని సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం ప్రారంభిస్తారని కలెక్టర్ తెలిపారు.

'సోనియాగాంధీతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది'

కరీంనగర్ అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సోనియాగాంధీతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టే సమయంలో కేసీఆర్ ఎక్కడున్నాడని నరేందర్‌రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ దొంగదీక్షతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటైందనడం విడ్డూరంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై మాట్లాడే నైతికహక్కు లేదన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు ఎండీ తాజ్, శ్రావణ్‌నాయక్, సమద్‌నవాబ్, జీడీ రమేష్, దన్నాసింగ్, పోరండ్ల రమేష్, కుర్ర పోషయ్య, ఖాజాఖాన్, షహెన్‌షా, అమేర్, అష్రఫ్, తదితరులు పాల్గొన్నారు.

కురుమసంఘం అడ్‌హక్ కమిటీ

కరీంనగర్ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కురుమ సంఘం జిల్లా ఎన్నికల అడహక్ కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు యెగ్గే మల్లేశం నియమించారు. 15 మంది సభ్యులతో కూడిన ఈకమిటీలో కడారి అయిలయ్య, బీర్ల బీరయ్య, ఎల్కపల్లి లచ్చయ్య, చెట్కూరి రాములు, కర్రె ప్రవీణ్‌కుమార్, యేగుర్ల అశోక్, అగిత రవీందర్, కర్రె రాజు, జూలపల్లి రఘునందన్, అనుగుల రాజకొమురయ్య, మ్యాకల నర్సయ్య, పోలె గట్టయ్య, బైరి మల్లయ్య నీల పద్మ కుమారస్వామి, పెద్ది రజిత భీంరాజు ఉన్నారు.

అన్నదానం

కరీంనగర్ అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యేలు కొమిరెడ్డి రాములు, కొమిరెడ్డి జ్యోతక్క జ్ఞాపకార్థం కరీంనగర్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. శనివారం మార్కెట్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం దాదాపు 300 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాపువాడ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు బొమ్మరాతి రామచంద్రం, కార్యదర్శి ఆకుల యాదయ్య, కళ్యాడపు ఆగయ్య, చిందం శ్రీనివాస్, దుగ్గు మహేందర్ రాకేష్ పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ కల్యాణం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని వేదభవనంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో శనివారం రాత్రి శ్రీలక్ష్మీనారాయణ కల్యాణ మహోత్సవం, దీపోత్సవం కన్నుల పండువలా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వికాసతరంగిణి, జెట్ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోను కలిసిన ఉద్యోగ సంఘం నాయకులు

సుభాష్‌నగర్, నవంబరు 30: (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణను శనివారం తెలం గాణ వైద్య ప్రజా ఆరోగ్య ఉద్యోగుల సంఘం(హెచ్-1)రాష్ట్ర నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఏవో ఖాదర్, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, రాష్ట్ర నాయకులు అష్రఫ్ అహ్మద్‌ఖాన్, ఎన్ శ్రీనివాస్‌కర్ణ, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారుల సంఘం కార్యవర్గం

కరీంనగర్ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ గ్రామంలో ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం అధ్యక్షునిగా బండి మల్లయ్య ఎన్నిక య్యారు. ఉపాధ్యక్షుడిగా దాడి లక్ష్మణ్ యాదవ్, క్యాషియర్‌గా కలకట్ల తిరుపతి యాదవ్, ప్రధాన కార్యదర్శి దాడి లచ్చయ్య, కార్యదర్శి పిల్లి ఓదెలు ఎన్నికయ్యారు.

సంక్రాంతికైనా 'భరోసా' దక్కేనా?

(5వ పేజీ తరువాయి)

బోనస్‌ను అందిస్తున్నది. సన్న వరి రకాలకే కాకుండా అన్ని రకాల వరి ధాన్యంపై బోనస్ ఇవ్వాలని రైతులు కోరుకుంటున్నారు. పెట్టుబడి సాయంగా ఎకరాకు 7,500 రూపాయలు ఇవ్వడానికంటే క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ఇవ్వడమే తమకు ఎక్కువ ప్రయోజనం చేకూర్చుతుందని రైతులు అంటున్నారు. జిల్లాల్లో 40 శాతం సాగు భూముల్లో కౌలు రైతులే పంటలు పండిస్తున్నారు. పండించిన ధాన్యానికి బోనస్ ఇస్తే కౌలు రైతులు లాభపడతారు. భూములు సాగు చేయకున్నా పెట్టుబడి సాయం, కౌలు పొందుతూ భూ యజమానులు లాభపడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. బోనస్ ఇవ్వడం ద్వారా కౌలు రైతులు ప్రయోజనం చేకూరుతుంది.

'విద్యార్థుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం'

భగత్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రాణాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని కరీంనగర్ బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. రాష్ట్రంలో నెల రోజులుగా ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతుంటే ప్రభుత్వంలో చలనం లేదని మండిపడ్డారు. వరుస ఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొందని అన్నారు. ఇంత జరుగుతుంటే సీఎం రేవంత్ స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. తక్షణమే ఘటనలపై విచారణకు కమిటీ వేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రాణాలంటే ప్రభుత్వానికి లెక్కలేదా అని నిలదీశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని విద్యాశాఖమంత్రిని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎన్‌సీసీ క్యాంపునకు అల్ఫోర్స్ విద్యార్థులు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఎన్‌సీసీ క్యాంపునకు కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక దశ నుండే దేశభక్తి పట్ల అవగాహన కల్పించడమే కాకుండా సమాజ హితమైన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు చేయూతనందించాలన్నారు. పాఠశాలకు చెందిన పి ప్రసన్నకుమార్, బి సహస్ అసెంబ్లీలో త్వరలో నిర్వహించే జాతీయస్థాయి ఎన్‌సీసీ క్యాంపునకు ఎంపిక కావడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులుపాల్గొన్నారు.

సెయింట్‌జాన్స్ పాఠశాలలో భాషా దినోత్సవం

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో శనివారం భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ విజయమేరీ, ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ పి ఇన్నాలు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ తదితర భాషల్లో కవితలు, పాటలు, జానపద గేయాలు, బతుకమ్మ పాటలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ భాషలపై రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పారమిత'లో క్రీడా పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మంకమ్మతోట పారమిత ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు, తల్లిదండ్రులకు క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులు, తల్లిదండ్రులకు పాఠశాల చైర్మన్ డాక్టర్ ఇ ప్రసాద్‌రావు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రశ్మిత, అనూకర్‌రావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, సమన్వయకర్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అచీవర్స్ పాఠశాలలో 'విద్యా వైభవం'

కరీంనగర్‌టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు విద్యా వైభవం పేరిట ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సి.హెచ్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పల్లవి మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యలో విద్యార్థుల అభ్యసన పటిష్టంగా ఉంటే ఉన్నత చదువులలో రాణించగలుగుతారని తెలియజేశారు. విద్యార్థులకు ప్రయోగాత్మక విద్యను అందిస్తున్నామన్నారు.

సర్వే ఆన్‌లైన్‌ను వేగవంతం చేయాలి

భగత్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్‌ను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ నోడల్ అధికారులను ఆదేశించారు. శనివారం కొత్తపల్లి మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న సర్వే కంప్యూటరీకరణను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే ఫారాలలో ఎన్యుమరేటర్లు నమోదు చేసిన వివరాలను కంప్యూటర్‌లో ఎంట్రీ వివరాలను సరిగా ఉన్నాయో పరిశీలించారు. సర్వే కంప్యూటరీకరణ సిబ్బందికి పలు సూచనలు చేశారు. చిన్ని తప్పిదాలు కూడా లేకుండా పకడ్బందీగా నమోదు చేయా లన్నారు. వివరాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. సకాలంలో ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్‌కట్ల వేణుమాధవ్, సిబ్బంది పాల్గొన్నారు.



సర్వే పత్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

టీటీఎల్ఎఫ్ మండలాధ్యక్షుడిగా నరేష్

గంగాధర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ లెక్చరర్స్ ఫోరం ఫౌండర్ గంగాధర మండలాధ్యక్షుడిగా మానాల నరేష్‌ను నియమిస్తూ టీటీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మాసం రత్నాకర్ ఉత్తర్వులు జారీ చేశారు. నరేష్ మా ట్లాడుతూ తెలంగాణ ప్రైవేటు లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన నియమాకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు రత్నాకర్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ రామచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సముద్రాల లింగారావు, జిల్లా అధ్యక్షుడు వేముల సుదర్శన్‌రెడ్డి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా ప్రభుత్వ పాఠశాలల బంద్

హుజూరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల బంద్ ప్రశాంతంగా ముగిసింది. కార్యక్రమంలో నాయకులు రాము, సందీప్, రోహిత్, రాహుల్, నితిష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌నగర్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలను బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గణేశ్, అభిలాష్, ఉమామహేశ్వర్, ప్రశాంత్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ విద్యార్థుల క్షేత్ర స్థాయి పర్యటన

వీణవంక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పంటల సస్యరక్షణకు రైతుల అనుసరిస్తున్న విధానాలను తెలుసుకునేందుకు శనివారం హైదారాబాద్ మల్లారెడ్డి విశ్వవిద్యాలయం అగ్రికల్చర్ విద్యార్థులు క్షేత్ర స్థాయిలో పర్యటించారు. రైతులను అడిగి పలు విషయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేవీకే విస్తరణ విభాగం శాస్త్రవేత్త మహేష్, అగ్రికల్చర్ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు. కాగా గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా మన్సూర్ యూనివర్సిటీకి చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు వ్యవసాయ విధానాలు, స్థితి గతులును తెలుసుకునేందుకు పర్యటించారు.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

రామడుగు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి తాటి వనం మీదుగా షానగర్ వెళ్లేదారిలో ఉన్నా కాజ్‌వే బ్రిడ్జి వద్ద రోడ్డు దెబ్బ తినడంతో శనివారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఈ సమస్యను గౌడ కులస్థులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లగా ఆయన మొరం పోయించి మరమ్మతు పనులు చేయించారు. . కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరివేని తిరుమల తిరుపతి ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'శ్రీ చైతన్య'లో ధ్యాన శిక్షణ తరగతులు



ధ్యానం చేస్తున్న విద్యార్థులు

తిమ్మాపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ సేవ పథకం ఆధ్వర్యంలో శనివారం పిరమిడ్ ధ్యాన శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ ధ్యానం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. శిక్షకుడు కె హరీష్‌కుమార్ విద్యార్థుల చేత ధ్యానం చేయించారు.

విద్యార్థులు సాంకేతిక పరిశోధనలపై దృష్టి సారించాలి

- టాస్క్ సీఈవో శ్రీకాంత్‌సిన్హా

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): క్లిష్టమైన సమస్యల పరిష్కారానికి విద్యార్థులు సాంకేతిక పరిశోధనలపై దృష్ట సారించాలని టాస్క్ సీఈవో శ్రీకాంత్‌సిన్హా అన్నారు. సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె శంకర్ అధ్యక్షతన శనివారం సామాజిక ఆవిష్కరణలు సరళమైన జీవితం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాంత్ సిన్హా మాట్లాడుతూ సమాజం ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలకు పరిష్కారాలు చూపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు పరిశ్రమలు స్థాపించి ఇతరులకు ఉద్యోగాలు ఇచ్చేం దుకు యత్నించాలని సూచించారు. పారిశ్రామిక అభివృద్ధిలో చిన్న ఆవిష్కరణకు పెద్ద అవకాశాలు ఉంటాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం ఉపాధికి, చిన్న పరిశ్రమల స్థాపనలకు సహకారం అందిస్తున్నాయని చెప్పారు. యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.. కార్యక్ర మంలో కళాశాల సెక్రటరీ వొడితెల సతీష్‌కుమార్, ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేషన్ సెంటర్ కో ఆర్డినేటర్ ప్రశాంత్ కుమార్, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్లు సృజన, వంశీకృష్ణ, అభిషేక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా

ఎమ్మార్పీఎస్ మండల కార్యవర్గం

తిమ్మాపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఎమ్మార్పీఎస్ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అల్వాల సంపత్, అధికార ప్రతినిధిగా కొమ్ము సంపత్, ఉపాధ్యక్షుడిగా బోయిని శేఖర్‌ను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా గాది సాగర్, కార్యదర్శిగా కిన్నెర బాబు, ప్రచార కార్యదర్శిగా గాజుల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుడిగా బోయిని శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

హుజూరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 30మంది విద్యార్థులకు శనివారం ఇన్నోవేషన్ మారథాన్ సర్టిఫికెట్లను హెచ్ఎం తిరుమల అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024-25లో శాస్త్ర సాంకేతిక రంగంలో హెల్త్ అండ్ వెల్ బీయింగ్ షస్టేనేబుల్ డెవలప్‌మెంట్ విభాగాల్లో ప్రాజెక్టు పూర్తి చేసిన 30మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులుతదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

హుజూరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ సేవా పథకం, యాంటీ డ్రగ్స్ విభాగం ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగ నిరోధకతపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇందిరాదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రూప్సీ రాణి, వైస్ ప్రిన్సిపాల్ మల్లారెడ్డి, అధ్యాపకులు లింగారెడ్డి, రేణుక, సుమలత, మహిపాల్‌రెడ్డి, పల్లవి, రమ, మంగమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి

గన్నేరువరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని మండల విద్యాధికారి కె రామయ్య అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మండల కేంద్రంలో మధ్యాహ్న భోజనంపై శనివారం ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన వంట మనుషులు శుభ్రతను పాటించాలన్నారు. వంట పాత్రలను ప్రతిరోజు వేడి నీళ్లతో శుభ్రపరిచేలా ప్రధానోపాధ్యాయులు శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రతి పాఠశాలలో ఫుడ్ కమిటీలను ఏర్పాటు చేసి మెనూ ప్రదర్శించేలా చూడాలని ఆదేశించారు. వారంలో మూడు రోజులు తప్పనిసరిగా గుడ్లను అందించాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని వండించకుంటే ప్రధానోపాధ్యాయులు బాధ్యులవుతారని హెచ్చరించారు. పాఠశాలలో ప్రతిరోజు ఉపాధ్యాయులు ఒక్కరైనా మధ్యాహ్న భోజనం చేసిన తరువాతనే విద్యార్థులకు వడ్డించాలని సూచించారు.

గ్రామాల్లో పౌర హక్కుల దినోత్సవం

శంకరపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలోని మొలంగూర్ గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దళితుల భూములు కబ్జాకు గురవుతున్నాయని డిప్యూటీ తహసీల్దార్‌కు మోరె గణేష్ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీ ల్దార్ మల్లేశం, ఎంపీవో ప్రభాకర్, ఆర్ఐ బాలకిషన్, ఏఏ స్ఐ సుధాకర్, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

చొప్పదండి: మండలం లోని గుమ్లాపూర్‌లో శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్ కుమార్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేష్, వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, మాజీ ఎంపీటీసీ బత్తుల లక్ష్మీనారాయణ, ఆర్ఐ మోహన్‌రెడ్డి, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు కోలపురి అంజయ్య, లింగాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: గంగాధర మం డలం తాడిజెర్రిలో శనివారం రెవెన్యూ అధికారులు పౌరహ క్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన తహసీల్దార్ అనుపమ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలందరు కలికట్టుగా ఉంటూ ఊరు అభి వృద్ధిలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. దళితుల సమ స్యలను అడిగి తెలుసుకు న్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం మండలాధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపటి నుంచి మల్లికార్జున బ్రహ్మోత్సవాలు

జమ్మికుంట రూరల్, నవంబరు 30(ఆంధ్యజ్యోతి): జమ్మికుం ట మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామంలో గల శ్రీదుబ్బ మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారం భం కానున్నాయి. తెల్లవారు జామున 4గంటలకు దృష్టి కుంభం, పెద్దపట్నం, స్వామివారి కల్యాణం, రథం తిరిగే కార్యక్రమంతో జాతర ప్రారంభం కానుంది. మార్చి 30వ తేదీతో వేడుకలు ముగియనున్నాయి. చుట్టూ పక్కల గ్రామాలతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.



శ్రీదుబ్బమల్లికార్జునస్వామి ఆలయం

నష్టపరిహారం మంజూరు

రామడుగు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రామడుగు వాగుపైన చేపట్టిన బ్రిడ్జి నిర్మాణంలో భూములను కోల్పోయిన రూ. కోటి 54 లక్షల 73 వేల 341లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంజూరు చేయించారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు రైతులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరీష్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

గంగాధర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం తాడిజెర్రి అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తహసీల్దార్ అనుపమ దుస్తులను పంపిణీ చేశారు. విద్యార్థుల ఆలోచన అనుగుణంగా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు శనివారం మండల ప్రత్యేకాధికారి అరుణ్‌కుమార్ దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి దినాకర్‌రావు, మాజీ ఉప సర్పంచ్ నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

మానకొండూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు తాము చేసిన సేవల ద్వారానే గుర్తింపు లభిస్తుందని మండల నోడల్ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోహెడ చంద్రమౌళి పదవీ విరమణ, పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు ఎం రాజిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, రాంమోహన్, అమరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రుద్రవరం లక్ష్మి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆమె కళ్లు సజీవం

తిమ్మాపూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మానగర్ గ్రామం ఎల్ఎండీ కాలనీకి చెందిన వెల్ది సుభద్ర(90) శనివారం అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యులు ఆమె కళ్లు దానం చేశారు. పెద్దపల్లి జిల్లాకి చెందిన సదాశయ పౌండేషన్ ఎనిమిదో కాలనీ పట్టణ అధ్యక్షుడు వెల్ది అనంతరాములు, పెద్దపల్లి జిల్లా మహిళా అధ్యక్షురాలు వెల్ది కవిత సుభద్ర కుటుంబ సభ్యులకు నేత్ర దానంపై అవగాహన కల్పించడంతో వారు అంగీకరించారు. దీంతో సుభద్ర కళ్లను హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ సిబ్బంది సేకరించారు.